# ఈనాటి మనుషులు ఆనాటి మనసులు

-కె.లక్ష్మీకాంతమ్మ

"ఇంతకీ మీరు రేపు వెళ్తున్నారా లేదా?'' శారద మరోసారి రెట్టించి అడిగింది.

"అదికాదే...'' రెండోసారి కూడా నసిగాడు రాజశేఖరం.

"ఎందుకండీ మరీ అంత బాధపడిపోతారు? నేనేం అత్తగార్ని ఇక్కడికి తీసుకురావద్దనడంలేదుకదా. ఆ ఇల్లు అమ్మేసి మీ అమ్మగార్ని ఇక్కడకు తీసుకు వచ్చేయండి.''

భార్యను ఎదిరించలేని బలహీనతో లేక ఆమె మాటల్లోనూ తను ఏకీభవించే అంశం కొంత ఆ క్షణమే కనిపించిందో తెలియదు. రాజశేఖరం నిలువుగా తలాడించాడు.

"సరే రేపు ఊరెళ్లి ఇల్లు అమ్మకానికి పెట్టి అమ్మను తీసుకు వచ్చేస్తానులేవే'' ముఖంలో మరే భావము వ్యక్తం చేయకుండా పలికాడు రాజశేఖరం.

శారద ముఖంలో ఆనందం కదలాడింది.

★★★

రాజశేఖరం బస్సు దిగాక ఎయిర్‌బ్యాగ్ భుజానికి తగిలించుకుని ముందుకు నడవసాగాడు.

పాతిక గజాల దూరం వెళ్లాక ఎదురుపడిన వీరాస్వామి మొదట అతడిని పరీక్షగా చూసి పోల్చుకున్నాక పలకరింపుగా నవ్వాడు.

"హైదరాబాద్ నుండి ఇప్పుడేనట్రా రావడం?''

వీరాస్వామి ఆ పల్లెలో పదెకరాల పొలానికి ఆసామి. ఆయన ఇల్లు ఉండేది రాజశేఖరం ఇల్లు వుండే వీధిలోనే. వరసలు పెట్టి పిల్చుకోవడం పల్లెలో సర్వసాధారణమైన విషయం కాబట్టి ఆ అలవాటుతో "అవును బాబాయ్'' అన్నాడు రాజశేఖరం.

"ఏమిటోరా నువ్వేమో బ్రతుకుతెరువు కోసం హైదరాబాద్ వెళ్తే ఆయమ్మ లంకంత కొంపలో బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా ఉంటోంది.''

"అందుకే కదా బాబాయ్ నేనిప్పుడు వచ్చింది. ఇల్లు అమ్మేసి అమ్మను మా ఇంటికి తీసుకెళ్లిపోతాను'' రాజశేఖరం వెంటనే పలికాడు.

వీరాస్వామి అతని ముఖంలోకి అదోలా చూసాడు. ఆ చూపు అతడిని అయోమయపరిచింది. అంతలో ఆయనే అడిగాడు.

"ఏంట్రా... ఇల్లు... ఇక్కడి ఇల్లు అమ్మేస్తావా?''

"అమ్మ కూడా సిటీకి వచ్చేస్తుంటే ఇంకా ఇక్కడ ఇల్లెందుకు బాబాయ్?''

వీరాస్వామి ఈసారి నసిగినట్టు పలికాడు "ఇల్లు అమ్మేందుకు మీ అమ్మ ఒప్పుకుంటుందో లేదో? అయినా అడిగి చూడు'' ఆయన ముందుకెళ్లిపోయాడు.

రాజశేఖరం ఇంటివైపు నడిచాడు.

రెండు వీధులు దాటాక కనిపించిందా ఇల్లు. విశాలమైన ఆవరణలో వున్న డాబా ఇల్లు.

అతడు గేటు తీసుకుని ఇంట్లోకి అడుగు పెడుతూ అటు చూసాడు. ఇంటి ముందున్న వేప చెట్టు కింద కూర్చుని బియ్యం ఏరుకుంటోంది తన తల్లి.

మనసు లోతుల్లోని ఏ నరమో కొద్దిగా కదిలింది. తనను గుండెలమీద పెట్టుకుని లాలించి పెంచిన తల్లిని ఆమె మానాన ఆమెను వదిలేసి తనేమో సిటీలో సంతోషంగా కాలం గడిపేస్తున్నాడు. కాస్త సిగ్గనిపించింది. కానీ ఆ సిగ్గు క్షణికమే. అతను ఆమె దగ్గరగా నడిచాడు.

అడుగుల సవ్వడికి తలెత్తి చూసిన అన్నపూర్ణమ్మ అతడిని చూడడంతోనే ముఖమంతా విప్పార్చుకుంది. ఏ ఆనందమో వంట్లోకి ఉత్సాహాన్ని తెచ్చిపెడితే ఒక్క ఉదుటున లేచి నిల్చుని "ఏంట్రా! వస్తున్నట్లు ఉత్తరం ముక్కయినా రాయకుండానే వచ్చేసావ్?''

అతడు నవ్వి ఊరుకున్నాడు.

"బహుశా నేను గుర్తు రావడంతోనే ఇక ఆగలేక వచ్చేసినట్టున్నావ్? అంతేనా?''

ఎవరో అజ్ఞాత వ్యక్తి ముల్లు తీసుకుని గుండెల్లో పొడిచినట్లుగా బాధపడ్డాడు రాజశేఖరం. తనొచ్చిన కార్యం ఈ తల్లికి చెప్పడం ఎలా అని అప్పుడే మదనపడ్డాడు కూడా. ఈసారి నవ్వలేక నవ్వాడు.

"రారా! లోపలికి వెళ్తాం'' ఆమె బియ్యం చాట చేతిలోకి తీసుకుని ముందు నడుస్తుంటే వెనక అనుసరించాడు రాజశేఖరం.

"కోడలు పిల్లా, పిల్లలు బాగున్నారా?'' అన్నీ ఆమే అడుగుతోంది.

"బాగున్నారు'' జవాబిచ్చాక తనొక్క మాట కూడా మాట్లాడలేదన్న విషయం గుర్తుకు రావడంతో అడిగాడు "నువ్వెలా ఉన్నావమ్మా?''

ఆమె తొలిసారిగా అదోలా నవ్వింది.

"నువ్వూ కోడలు పిల్ల దగ్గర లేరన్న దిగులు తప్ప నాకేంరా హాయిగానే వున్నాను.''

అవకాశం వచ్చింది కదాని అతడు వెంటనే చెప్పాడు "నీకు ఆ ఒక్క దిగులు కూడా ఉండకూడదనే నేనిప్పుడు వచ్చింది.''

అన్నపూర్ణమ్మ ఆశ్చర్యంగా చూసింది కొడుకుకేసి.

అతడు తడబడి చెప్పాడు "అదేనమ్మా. నిన్నూ నా వెంట హైదరాబాద్ తీసుకెళ్లాలనుకుంటున్నాను.''

అన్నపూర్ణమ్మ ముఖంలో ఆనందం కదలాడింది.

అంతలో అతడు అన్నాడు "నేను ఇక్కడ రెండురోజులుంటాను. వీరాస్వామి బాబాయికి చెప్పి ఇల్లు అమ్మకానికి పెడదాం. మంచి రేటొస్తే అమ్మేసి వెళ్లిపోదాం.''

అన్నపూర్ణమ్మ వెంటనే ఉలిక్కిపడింది. తర్వాత సర్దుకుని కొడుకు ముఖంలోకి తదేకంగా చూసింది.

"ఏంట్రా రాజూ! ఈ ఇల్లు... ఈ ఇల్లు అమ్మేద్దామనుకుంటున్నావా?''

"అవునమ్మా. పల్లెలో ఇల్లు వున్నందువల్ల మనకెలాంటి ప్రయోజనమూలేదు. ఇంతకాలం ఏదో నువ్వున్నావు కదాని ఇల్లు అమ్మకుండా ఆగాను. ఇప్పుడు నువ్వూ నా వెంట వచ్చేస్తే ఇక్కడ ఇల్లు ఎందుకు అనవసరంగా. ఈ ఇల్లు అమ్మి ఆ లక్ష రూపాయలు వడ్డీకిచ్చినా నెలకో రెండువేలు వస్తాయి.''

అన్నపూర్ణమ్మ కొద్దిక్షణాలు మాట్లాడలేకపోయింది. చివరికి ప్రయాణంలో అలసిపోయి

వచ్చిన కొడుకుతో వాదనలతో విసిగించడం ఎందుకనుకుందో ఏమో "సర్లే! ముఖం కడుక్కుని రా. ఎప్పుడు తిన్నావో ఏంటో ముందు భోజనం చేయి'' చెప్పింది.

రాజశేఖరం తలాడించి పెరడు వైపు నడిచాడు.

★★★

పెరట్లోని వేపచెట్టు కింద కూర్చుని ఆ డాబా ఇంటికేసే తదేకంగా చూస్తోంది అన్నపూర్ణమ్మ. అలనాటి దృశ్యాలు, సజీవ దృశ్యాల్లా కనుల ముందు కదలాడుతుంటే అప్రయత్నంగా ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. ముప్పయ్యేళ్లక్రితం నాటి దృశ్యాలు అవి. పునాదుల కోసం కూలీలతోపాటు పార పట్టుకుని దిగి గుంట తవ్వుతున్నాడు శ్రీనివాసరావు. తాపీ మేస్త్రీలు గోడ కడుతుంటే ఇటుకలు అందిస్తున్నాడు. తను కేరియర్‌లో భోజనం తీసుకుని ఆ చోటుకి వెళ్లింది. తామిద్దరూ ఆ కట్టడం కేసి అభిమానంగా, ఆప్యాయంగా చూసుకున్నారు.

అదో బొమ్మరిల్లు. తమకు సంబంధించినంతవరకూ ఈ ప్రపంచంలోకెల్లా అద్భుతమైన కట్టడం ... ఆ ఇంటి తలుపులు ఎలా ఉండాలి అన్న దగ్గర్నుంచీ, ఇంటికి ఏ రంగు, సున్నం వాడాలి అన్నంత వరకూ తామిద్దరూ కలిసే నిర్ణయాలు తీసుకునేవారు.

ఆ ఇంటిని చూసుకుంటుంటే తనకెంతో సంతృప్తి కలిగేది. అందరూ గొప్పగా చెప్పుకునే తాజ్‌మహల్‌ని తీసుకొచ్చి తమ ముందు ఉంచినా తాము మాత్రం ఆ అద్భుత కట్టడం చూడడం మానేసి తమ ఇంటినే చూస్తూ ఉండిపోయేవారు అనడంలో ఏమాత్రం ఆశ్చర్యంలేదు. తమకే కాదు, కష్టపడి ఇల్లు కట్టుకున్న ఏ దంపతులకైనా ఆ ఇల్లు ఓ మహాద్భుతమైన కట్టడంలా అనిపిస్తుందన్నమాట నిజం.

"అమ్మా..''

ఆమె ఆలోచనల నుండి తేరుకుని తలెత్తి అటు చూసింది. మసక చీకట్లో కొడుకు ఆకారం అస్పష్టంగా కనిపించింది.

"చీకట్లో కూర్చున్నావేంటమ్మా?''

"ఏం లేదులే'' అనేసి మాట మారుస్తూ అడిగింది "వీరాస్వామి బాబాయ్ దగ్గరకెళ్లావా? ఆయనేమన్నారు?''


"మన ఇల్లు అమ్ముతామంటే కొనుక్కునేందుకు చాలామంది రెడీగానే వున్నారట. కానీ బాబాయ్‌కి మనం ఇల్లు అమ్మడం ఇష్టం లేనట్టుంది.''

"ఇల్లు అమ్మడం ఎందుకురా? ఎంతకాలం ఉన్నా సిటీ మనది కాదుకదా? ఎప్పటికైనా మీరు మళ్లీ పల్లెకు రావలసినవాళ్ళే. అందుకని ఆ ఇల్లు అలాగే ఉంచేసి అమ్మను తీసుకెళ్లిపో అని చెబుతున్నాడు.''

"మరి నువ్వేమన్నావు?''

"లేదు బాబాయ్. ఇల్లు అమ్మేద్దామనే అనుకుంటున్నాను. అంతగా ఈ పల్లెకు రావాలనిపిస్తే అప్పుడు మళ్లీ ఇల్లు కట్టుకుంటాను అని చెప్పాను.''

అన్నపూర్ణమ్మ మనసు కలుక్కుమంది. తాము ఎంతోకాలం కలలుకని కట్టుకున్న బొమ్మరిల్లు అంటే ఏమాత్రం మమకారం చూపించకుండా తమ బిడ్డ అమ్మేస్తానంటుంటే ఏమనాలో తెలియనట్లు ఆమె మౌనంగా ఉండిపోయింది. తను గట్టిగా ఎదిరించి కనీసం తను బ్రతికి వున్నంత కాలం ఆ ఇల్లు అమ్మడానికి లేదంటే వాడేమీ చేయలేడని తనకు తెలుసు. కానీ తాను అలా అన్నందువల్ల తామిద్దరి మధ్యా మనస్పర్థలు రావచ్చు. అది తనకు ఇష్టంలేదు.



మర్నాడు-

రాజశేఖరం కోరుకున్న ధరకే ఇల్లు అమ్మడం జరిగిపోయింది. అడ్వాన్స్ చేతిలో పడింది. మిగిలిన డబ్బు చెల్లించడానికి గడువు అడిగారు ఇల్లు కొనుక్కున్నవాళ్లు.

వచ్చిన పని పూర్తయినందుకు రాజశేఖరం ముఖం మతాబులా వెలిగిపోసాగింది. 'ఈ డబ్బు చూసి శారద ఎంత సంబరపడుతుందో' అనుకున్నాడు అతడు.

ఆ రాత్రి రాజశేఖరం తల్లితో చెప్పాడు "అమ్మా! రేపు ఉదయం మనం సిటీకి వెళ్లిపోతున్నాం. అవసరమనుకున్న సామాన్లు కొంత సర్దుకో. రెండురోజుల్లో లారీ తీసుకువచ్చి మిగిలిన సామాను ఎక్కించుకొచ్చేస్తాను.''

అన్నపూర్ణమ్మ తలాడించిందో లేదో కూడా అతడు చూడలేదు. ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బుతో భవిష్యత్ ప్రణాళికలు రచించుకుంటూ, ఆ కలల్లో తేలిపోతూ ఆ రాత్రి హాయిగా నిద్రపోయాడు.

***

తెల్లవారింది.

రాజశేఖరంకి మెలకువ వచ్చింది. అతడు బెడ్ మీదే లేచి కూర్చున్నాడు. తను నిద్ర లేవకముందే ఇంటి పనిలో పడి తను నిద్ర లేచింది ఎలా గమనిస్తుందో ఏమో క్షణాల్లో కాఫీ గ్లాసుతో బెడ్ ప్రక్కన నిలబడే తల్లి ఈ రోజు అలా హాజరుకాకపోవడం అతడికి కొద్దిగా ఆశ్చర్యం కలిగించింది. ఇల్లు అమ్మేసినందుకు ఆమెకు బాధ కలిగిందన్న విషయం అర్థమవుతూనే వుంది.

అయినా ఆమెకు ఆ కోపం ఎంతోకాలం ఉండదని అతని నమ్మకం. రాజశేఖరం బెడ్ దిగాడు. అటు చూస్తే దూరంగా నవారు మంచం మీద పడుకుని వుంది తన తల్లి. అతడు అటుగా అడుగులేసాడు.

మంచం దగ్గరగా వెళ్తున్నప్పుడే ఏదో అనుమానం కలిగింది. దగ్గరగా వెళ్లాక ఆమె వంటిమీద చేయి వేయగానే షాక్ కొట్టినట్లనిపించింది.

అతడు పెద్దగా "అమ్మా" అని అరిచాడు.

క్షణాల్లో ఇరుగు పొరుగు ఆ ఇంట్లో చేరిపోయారు.

***

పదకొండో రోజున కర్మకాండ ముగిసింది.

ఆ రాత్రికే రాజశేఖరం తన భార్యాబిడ్డలతో హైదరాబాద్‌కి ప్రయాణమై వెళ్లిపోవలసి ఉంది.

రాజశేఖరం సూట్‌కేసులు సర్దుకుంటుండగా వీరాస్వామి అతడి దగ్గరగా వచ్చాడు.

"ఒరేయ్ రాజూ! మన ఇల్లు కొనుక్కుంటానని అడ్వాన్స్ ఇచ్చినవాళ్ళు మనసు మార్చుకున్నారా. వాళ్ళు ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి ఇవ్వకపోయినా ఫర్వాలేదుగానీ ఇల్లు మాత్రం కొనుక్కోలేమంటున్నారు.''

"అదేంటి బాబాయ్'' ఆశ్చర్యపోయాడు రాజశేఖరం.

"వాళ్లకూ ఈ ఇంటిమీద మీ అమ్మకున్న మమకారం అర్థమయినట్టుంది. ఈ ఇల్లు కొనుక్కునేందుకు వాళ్లకు మనసొప్పడంలేదు.''

"అమ్మకు ఇంటిమీద మమకారం ఏమిటి? వీళ్లకు మనసొప్పకపోవడం ఏమిటి? నాకేం అర్థం కావడంలేదు'' ఈసారి అతడు కాస్త అయోమయంగా చూసాడు.

వీరాస్వామి అదోలా నవ్వాడు.

"ఒరేయ్ రాజూ! ఒక తరంలోని వ్యక్తుల కష్టం, మమకారం, అభిమానం, ఆప్యాయతలు ఆ తరంలోని వ్యక్తులే అర్థం చేసుకోగలరు. మరో తరం మనుషులకు ముందు తరం వ్యక్తులలోని ఈ భావాలు అర్థం లేనివిగానే అనిపించవచ్చు. అందుకు ఆ రెండోతరం వ్యక్తులను తప్పు పట్టాల్సిన అవసరం లేదనుకుంటా. ఇక మీ అమ్మకు ఈ ఇంటిమీద మమకారం ఎందుకంటే ఆడదానికి పేగు తెంచుకు పుట్టిన బిడ్డ మీద ఎంత మమకారం వుంటుందో ఇటుకలు అందించి కట్టుకున్న ఇంటి మీదా అంతే మమకారం వుంటుంది. అంతేకాదు, ఆడది తన భర్త మట్టిలో కలసిన చోటే తనూ మట్టిలో కలసిపోవాలనుకుంటుంది. కానీ మీ అమ్మ తన మనసులోని భావాలు నీకు చెప్పలేకపోయింది. అటు కన్నకొడుకు మనసు నొప్పించడం ఇష్టంలేక చివరికి 'మీ నాన్న మట్టిలో కలసిన చోటే నేనూ మట్టిలో కలవాలనుకుంటున్నాను' అని నీతో చెప్పలేక అన్నింటికీ పరిష్కార మార్గం మరణమేనని, ఆ మరణాన్ని స్వచ్ఛందంగా ఆహ్వానించింది.''

అప్పటికే రాజశేఖరం కళ్లు చెమర్చాయి.

కొంతసేపు అలాగే నిలబడిపోయాడు. కలలో కదిలినట్టే పక్కకు తిరిగి సూట్‌కేసులోంచి డబ్బు తీసి వీరాస్వామి చేతిలో పెడుతూ చెప్పాడు "బాబాయ్! నేనిక ఈ ఇల్లు ఎవ్వరికీ అమ్మదలచుకోలేదు. దయచేసి ఈ డబ్బుని వాళ్ళకి తిరిగి ఇచ్చేయండి''

వీరాస్వామి ముఖంలో సంతృప్తి కదలాడింది.

★



## సహనం

చూడగానే ఆకట్టుకునే అందాలభామ త్రిషా. 'వర్షం'తో ఆనందంగా ఉన్న త్రిషాకి కాలం కలిసొచ్చింది. ఈ చిత్రం ఆమెకి అవకాశాల వరదని సృష్టించింది. 'ఈ చిత్రం హిట్ అవుతుందని ఊహించాను. కానీ ఇంత భారీ హిట్ అవుతుందనుకోలేదు. బాలీవుడ్‌లో దర్శకులు, టెక్నీషియన్లు ఎంతో నిజాయితీతో పనిచేస్తారు. వారిలో సహనం కూడా చాలా ఎక్కువ' అంటోంది. తెలుగులో హిట్ అయిన 'ఒక్కడు'ని తమిళంలో రీమేక్ చేస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్ ఛాన్స్ కొట్టేసింది త్రిషా. .

